క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



నస్రుల్లాబాద్ (బీర్కూర్): బీర్కూర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంపీపీ రఘు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించా రు. ఎంపీడీవో భానుప్రసాద్, టీచర్లు ఉన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు



పిట్లం(జుక్కల్): మండలంలోని గౌరారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సిబ్బంది మంగళవారం నలుగురు బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. హెచ్ఎం మధుసుదన్, ఉపాధ్యాయులు అబ్దుల్ రజాక్, సీఆర్‌పీ గోపాల్ పాల్గొన్నారు.

ఆలయ భూమికి వేలం

రాజంపేట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయ సాగు భూమి వేలంపాట మంగళవారం సర్పంచ్ ఆముద సౌమ్య, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తుల నిర్ణయం మేరకు గ్రామానికి చెందిన భూస సింహం గతంలో అకాల వర్షం కారణంగా పంట నష్టపోయిన నేపథ్యంలో అతడికి రూ. 80వేలకు ఒక సంవత్సరం సాగుకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

బాన్సువాడలో రక్తదాన శిబిరం



బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపోలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డీఎం సదాశివ్, అసిస్టెంట్ మేనేజర్ బస్సిలాల్, డిప్యూటీ సూపర్‌వైజర్ సుధాకర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ సురేందర్, అసిస్టెంట్ మేనేజర్ బాలాజీ ఉన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు



భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో కాచాపూర్ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 64వ రోజు కొనసాగాయి. పలు యువజన సంఘాల వారు దీక్ష శిబిరంలో కూర్చొని, నినాదాలు చేశారు. ఫ్యాక్టరీ వ్యర్థాల నుంచి తమను కాపాడేందుకు చర్యలను ప్రారంభించే వరకు పోరాటం చేస్తామని వారు తెలిపారు.

విత్తన దుకాణాల తనిఖీ

భిక్కనూరు: మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను వ్యవసాయాధికారి రాధ మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ పుస్తకాలను బిల్లు పుస్తకాలను పరిశీలించారు. పలు రకాల విత్తనాల నమూనాలను సేకరించి రాజేంద్రనగర్ ల్యాబ్‌కు పంపించారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లించాలన్నారు. సమాఖ్య అధ్యక్షురాలు కుంట రజిత, సీసీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్టీసీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోపాల్‌పేట విలేజ్ బస్ ఆఫీసర్ దేవుల పల్లి రవీందర్ సూచించారు. మండలంలోని మాల్తుమ్మెద, గోపాల్‌పేట గ్రామాలలో మంగళవారం ఆయన ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాయితీబస్‌పాస్‌లు, వివిధ రకాల టికెట్ల వివరాలను తెలిపారు.

మాది రైతు ప్రభుత్వం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్
- రామేశ్వర్‌పల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



రామేశ్వర్‌పల్లిలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

భిక్కనూరు: దేశంలోనే ఏకైక రైతు ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రామేశ్వర్‌పల్లి గ్రామానికి సబ్‌స్టేషన్ అవసరం ఉందని సీఎం కేసీఆర్‌కు చెప్పగానే ఆయన వెంటనే స్పందించి సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశాడన్నారు. రామేశ్వర్‌పల్లి గ్రామం అభివృద్ధి కోసం గ్రామస్తులు ఐకమత్యంగా ఉండడం అభినందనీయమన్నారు. గ్రామానికి రావల్సిన కట్టుకాలువ విషయంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మనాగభూషణంగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ పోతిరెడ్డి, విండో చైర్మన్ నాగార్తి భూంరెడ్డి, నేతలు మధుసూధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అమృత్‌రెడ్డి, సుదర్శన్, ద్యావర లక్ష్మి, మాధవి బలరాం, పైతరి స్వామి, ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం..

కామారెడ్డి రూరల్: మండలంలోని శాబ్దిపూర్ గ్రామంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వవిప్‌ను మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సర్పంచ్ పస్తం యాదమ్మ పరశురాం, ఉప సర్పంచ్ నాగరాజు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్ తల్లి నర్సవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో పోచయ్య

బిచ్కుంద(జుక్కల్): గ్రామాల్లో ఏఈవోలు రైతులకు ప్రతి రోజు అందుబాటులో ఉండి అవసరమగు జాగ్రత్తలు, సలహాలు అందించాలని ఏవో పోచయ్య అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఆయన ఏఈవోలతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. భూమిలో నీటి తేమ ఉండటంతో సోయా, పెసర, మినుము, కంది విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. పత్తి విత్తనాలు వేయరాదని, రెండు పెద్ద వర్షాలు పడిన తర్వాత విత్తుకోవాలని రైతులకు సూచించాలని అన్నారు. అలాగే జాతీయ ఆహార భద్రత పథకం కింద కొత్తరకం శాంపిల్ కంది, మినుము విత్తనాల మినీ కిట్ వచ్చిందన్నారు. మండలానికి కంది విత్తనాలు 668కిలోలు, మినుము 276కిలోలు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆదర్శంగా నిలుస్తున్న రైతులకు ఉచిత మినీ కిట్ల విత్తనాలు అందించాలని ఏఈవోలను సూచించారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లి, కాచాపూర్ గ్రామాల్లో మంగళశారం కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇసన్నపల్లిలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, కాచాపూర్‌లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మద్ది చంద్రకాంత్‌రెడ్డిలు పాల్గొని, మాట్లాడారు. కాంగ్రెస్ పథకాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సుదర్శన్, తిర్మల్‌స్వామి పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషిచేయాలి



దోమకొండ: బీఎస్పీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పైడిమర్రి ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం అసెంబ్లీ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. కామారెడ్డి నియోజకవర్గ అభ్యర్థి గెలుపునకు ప్రణాళిక తయారీని వివరించారు. సంజయ్‌కుమార్, బాల్‌రాజు, హరిలాల్‌నాయక్, స్వామి, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సాధన సంస్థ జిల్లా కమ్యూనిటీ మొబిలైజర్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పోచారం గ్రామంలో మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏమైనా ఇబ్బందులకు గురయ్యే పిల్లలు చైల్డ్‌లైన్ నం.1098కు ఫోన్ చేయాలన్నారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

భిక్కనూరు: జీపీ కార్యాదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండిచ పల్లెల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. భిక్కనూరులో మంగళవారం ఆయన మాట్లాడారు. కొందరు పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకుండా సమయ పాలన పాటించని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కావడంతో మంగళవారం అధికారులు మరమ్మతులు చేయించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయి, నీరు రోడ్డుపైకి వస్తుండటంతో సోమవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి మిషన్ భగీరథ డీఈ కౌశిక్ స్పందించి, లీకేజీకి మరమ్మతులు చేయించారు.

రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్లు నడపొద్దు

బాన్సువాడ: కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్డుపై నడిపితే కేసులు నమోదు చేస్తామని బాన్సువాడ టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్లపై కేజ్‌వీల్ ట్రాక్టర్‌ను నడిపితే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మహమ్మద్ నగర్ గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలపై కానిస్టేబుల్ శ్యామ్, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులకు ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతాల నంబర్లను చెప్పవద్దని చెప్పారు. సిబ్బంది బాల్‌రాజు, బద్రి, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్టులు, బైక్‌లు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, లేని యెడల జరిమాన విధిస్తామని పేర్కొన్నారు. ఏమైన సమస్యలు వస్తే 100 నంబరుకు సంప్రదించాలన్నారు.

అంగడిలో పోలీస్ పెట్రోలింగ్

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలోని అంగడిలో మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఏఎస్సై రామేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంగట్లో దొంగలకు చెక్‌పెట్టడానికి జనాలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. అంగడి ముగిసేవరకు పెట్రోలింగ్ చేసినట్లు చెప్పారు.

శాంతికమిటీ సమావేశం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై ఉమేష్ మాట్లాడుతూ.. ముస్లింలు బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, పండుగ సందర్భంగా ఎక్కడ కూడా గోవధ చేయవద్దన్నారు.

సంక్షిప్తం

బోరు మోటార్ ఏర్పాటు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని మైనార్టీ స్మశాన వాటిక, ఈద్గ వద్ద మంగళవారం గ్రామ పంచాయతీ నిధులతో బోరు మోటార్‌ను ఏర్పాటు చేశారు. మస్జిద్ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ స్కూల్ చిల్డ్రన్) వారి సౌజన్యంతో పిట్లం, జుక్కల్, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలలోని జెడ్పీ స్కూల్స్ విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఈవో దేవిసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌కు సన్మానం

దోమకొండ: మండల కేంద్రంలోని రేణుకామాత ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం గౌడసంఘం ఆధ్వర్యంలో సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్యను సన్మానించారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు దుస్తుల అందజేత

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన అంజయ్య గుడిసె కొన్ని రోజుల క్రితం దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబానికి ఎల్లమ్మ తండా సర్పంచ్ భీంరావు మంగళవారం బట్టలు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన పురంసిద్ధిరాములు మస్కట్లో 12 రోజుల క్రితం మరణించాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మోహన్‌రెడ్డి, పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాగన్న పరామర్శించారు.

రోడ్డు పనులకు భూమిపూజ

ఎల్లారెడ్డి: పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ మంగళవారం భూమిపూజ చేశారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు వినోద్, శ్రీనివాస్ ఉన్నారు.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మురికికాలువ నాలుగురోజుల క్రితం స్తంభించింది. మంగళవారం గోపాల్‌పేట గ్రామపంచాయతీకి సంబంధించిన సపాయిలు బాలయ్య, ఎల్లయ్య సుమారు మూడుగంటలకుపైగా శ్రమించి, పూడికను తీసేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ కృత్యాలు ఇంటివద్ద లభించే వస్తువులతో ఎలా చేయాలో తెలిపే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ఆగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ ఫీజులో రాయితీ ఇవ్వాలి

కామారెడ్డి టౌన్: ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50శాతం రాయితీ ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సభ్యులు డిమాల్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు.

వీధి కుక్కల పట్టివేత

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో తిరుగుతున్న వీధికుక్కలను మంగళవారం స్పెషల్ టీం సభ్యులు పట్టుకున్నారు. వాటిని ప్రత్యేక వాహనాల్లో తరలించారు.

కరెంట్ వైర్లకు అడ్డున్న కొమ్మల తొలగింపు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడిలో విద్యుత్ సిబ్బంది మంగళవారం విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించినట్లు ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ తెలిపారు.

కాచాపూర్‌లో వైద్య శిబిరం

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్ గ్రామంలో హైదారబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 658 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్, సర్పంచ్ సులోచన పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్‌లోగల వేంకటేశ్వర ఆలయానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్ మంగళవారం రూ.11వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి సభ్యులు నరేందర్‌ను సన్మానించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపల్లి సిద్దరాములు, గ్రామపెద్దలు హరిశ్చంద్రరెడ్డి, ఎన్గు బాల్‌రాజురెడ్డి, తాటిపల్లి రాజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నియామకం..



కామారెడ్డి అర్బన్: రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా దోమకొండకు చెందిన భూపాల్ విజయానంద్ నియమితులయ్యారు. ఈమేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం హైదరాబాద్‌లో ఆయనకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లాలో ముదిరాజ్‌ల అభవృద్ధి, చెతన్యం కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కరాటే ముదిరాజ్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితి డైరెక్టర్లు..



రాజంపేట: మండలకేంద్రలంలో రైతు సమన్వయ సమితి డైరెక్టర్లుగా ఎన్నికైనా వారికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఎన్నికైన రాజిరెడ్డి, కట్టెకుంట్ల సిద్దరాములు, దొబ్బల గంగారాంలు ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌ను సత్కరించారు.

బీజేపీ నేతల ఇంటింటి ప్రచారం





బాన్సువాడలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు.. సదాశివనగర్‌లో..

బాన్సువాడ: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాన్సువాడలో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అందుకే ఇంటింటికి వెళ్లి బీజేపీ చేపట్టే పథకాలపై వివరిస్తున్నామని అన్నారు. నాయకులు పైడిమల్ లక్ష్మినారాయణ, శంకర్‌గౌడ్, శ్యాం, రామకృష్ణ ఉన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మంగళవారం గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, గంగాధర్ రావు, రాజేందర్ రావు, భూంరావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని లక్ష్మాపూర్, కొట్టాల్, హాజీపూర్ గ్రామాలలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ, కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల గురించి వివరించారు. నాయకులు సాయిబాబా, నరేష్ తదితరులు ఉన్నారు.

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ




బాన్సువాడలో కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్న కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2లక్షల వరకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ అన్నారు. పట్టణంలో మంగళవారం 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ. 2లక్షల రుణమాఫీ, ఇల్లు లేని వారికి రూ.5 లక్షల సాయం, రూ.500లకే గ్యాస్, ఆడపిల్లలకు స్కూటీ, ఇంట్లో ఇద్దరికి రూ.5వేల పింఛన్ అందజేయనున్నట్లు పార్టీ మేనిఫెస్టోను వివరించారు. నాయకులు అలిబిన్‌అబ్దుల్లా, ఖలేక్, శేఖర్‌రెడ్డి, గుడాల నగేష్, రెంజర్ల సాయిలు, వెంకన్న, నార్ల రఘు, కొట్టం గంగాధర్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాలలో పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ మంగళవారం గడప గడపకి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కట్టకింది తాండా, తిమ్మారెడ్డితాండా, రత్నాపూర్, మౌలాన్‌ఖేడ్ గ్రామాలలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇవ్వనున్న పథకాల గురించి వివరించారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



పీఎం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పీఎం నరేంద్ర మోదీ ప్రసంగించిన 'మేరా బూత్ – సబ్ సే మజ్బూత్' కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరా బూత్ సబ్ సే మజ్బూత్ కార్యక్రమంలో 1500 మంది వివిధ రాష్ట్రాలకు చెందిన విస్తారక్ కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని మండలాలకు చేరుకుంటారన్నారు. బూత్‌ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీ పటిష్టత గురించి వివరాలు సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రూ.6వేల పెన్షన్ ఇవ్వాలి



ఎల్లారెడ్డి: దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని దివ్యాంగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వారు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు అనంతరం గిర్దావార్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. దివ్యాంగుల సమితి జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, నాయకులు ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

సమాచారం..

నేడు నిజాంసాగర్ మండల సమావేశం

నిజాంసాగర్(జుక్కల్): మండలకేంద్రంలో బుధవారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారు లు సమావేశానికి సకాలంలో హాజరు కావాలన్నారు.

నాగిరెడ్డిపేట మండలంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల పండుగ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామంలో మంగళవారం ఊరడమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కాశీంసాబ్, వైస్ ఎంపీపీ మనోహర్ నాయకులు బాబుసేట్, విఠల్ రెడ్డి, మొగులాన్ ఉన్నారు.

లచ్చన్ గ్రామంలో..



మద్నూర్(జుక్కల్): మండలంలోని లచ్చన్ గ్రామంలో మంగళవారం గ్రామస్తులు బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు బోనాలు, పసుపు నీళ్లు, సాకలను అమ్మవారికి సమర్పించుకున్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఇసన్ననపల్లి(రామారెడ్డి)లో వెలిసిన కాల భైరవుడి పుణ్య క్షేత్రంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా తోగుంట పీఠాధిపతి మానవ నంద సరస్వతి స్వామీజీ దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసశర్మ, వంశీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.